
కథ

మా వీధిలో వారం వారం జరిగే కూరగాయల సంతలా స్కూలు ఆవరణంతా గోలగోలగా గందరగోళంగా ఉంది. అలా లేకపోతే అది స్కూలే కాదు. ఇంకా ఫస్టు బెల్లు మోగలేదన్నమాట. "పిన్సిపాలు సార్రమ్మంటాండమ్మోవ్" అని చెప్పిపోయింది మా పొగరుమోతు పోచమ్మ.

మేష్టర్లు, హెడ్ మేష్టర్లు పోయి ముచ్చటగా మూడే క్లాసులతో నడుస్తున్న స్కూలుకైనా ప్రిన్సిపాళ్లూ, సార్లూ, మేడమ్‌లూ తయారైపోయారు. బాగానే ఉందిలేండి. జీతం మూడంకెలే అయినా హోదా అయిదక్షరాలు దాటితే అదో తృప్తి!




బోరుగా మొహం పెట్టి కాళ్లీడ్చుకుంటూ ప్రిన్సిపాల్ గదివైపు వెళ్లాను. ఏదో కాలక్షేపం కోసం వీధి చివరే ఉంది కదా అని ఈ స్కూల్లో టీచరుగా చేరాను. ప్రిన్సిపాలెందుకు పిలిచాడా అన్న టెన్షన్ లేదు. నా పనిలో ఏదోవంక పెట్టి ఇంతోటి ఉద్యోగమూ ఊడగొడతాడన్న భయం అసలే లేదు. మరీ మంచిది. ఇంట్లో కూచోచ్చు. "ఎందుకొచ్చిన శ్రమ ఈ వయసులో" అంటూండే మా ఆయన మహా సంతోషిస్తారు. వేళకి కాఫీ, టిఫిన్లందుతాయని. నేనే యూనివర్సిటీ ప్రొఫెసర్నో అయ్యుంటే సంతోషించే వారేమోగానీ మా పిల్లరత్నాలు, ఇలా బొత్తిగా వీధిబడి లాంటి వీధి చివరి 'కాన్వెంటు'లో పనిచేస్తున్నందుకు మహా అవమానంగా ఫీలయిపోతుంటారు. నా ఉద్యోగం ఊడితే వాళ్లూ సంతోషిస్తారు. మరంచేత మనకి పోయిందేవీ(లేదు. తాపీగా ప్రిన్సిపాల్ సారు గది గుమ్మం చేరా. నేనొస్తున్నానంటే ఆయనకీ కాస్త టెన్షనొస్తుందని నాకు గట్టి నమ్మకం. ఎందుకో మీకే తెలుస్తుంది.

"మనస్కూల్లో యు.కె.జి. స్టూడెంట్స్‌కి టెల్గూ ఆల్ఫాబెట్స్ లెర్న్ చేయించాలని మేనేజిమెంటు డిసైడయింది. మీకు తెలుసుగా... యు.కె.జి. క్లాస్ మేడమ్ మరాఠీ ఆమె. ఆమెకు టెల్గూ రాదు. అందుకని యు.కె.జి.కి టెల్గూ పీరియడ్ మీరు తీసుకుని వాళ్లకి టెల్గూ ఆల్ఫా బెట్స్ మీరు లెర్న్ చేయించాలి." ఈ భాష వినడం కన్నా చెవుల్లో సీసం కరిగించి పోయించుకుంటే గొప్ప సుఖంగా ఉంటుందనుకుంటా.

"అలాగే లెండి. అయినా అది టెల్గూ కాదు మనం మాటాడుతున్నది తెలుగు. అయినా గానీ అలా ఒకే భాషకి చెందిన వర్ణమాలని ఆల్ఫా బెట్స్.. 'బెట్' అని మాత్రమే అనాలి. చాలా భాషలకు చెందిన అక్షరక్రమాన్ని గురించి మాట్లాడేప్పుడు మాత్రమే ఆల్ఫా'బెట్స్' అని వాడాలి" అన్నాను.

ఎర్రబడ్డ మొహంతో గురువుగారు గుర్రుగా చూసారు. నేను వెనుదిరిగాను. వెనకనుంచి బుర్రుమని సొరుగులాగిన చప్పుడు వినిపించింది. మా 'పిన్సిపాలుసారు' ఈ స్కూల్లో చేరి వంద రోజులు పూర్తైన సందర్భంలో నేనే ఆయనకిచ్చిన 'రెన్ అండ్ మార్టిన్' 'ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ' ఆ సొరుగులో ఉంటాయని నాకు తెలుసు. ఆయనిప్పుడు నేను చెప్పిన పాయింటు తప్పో ఒప్పో తేల్చుకోడానికి ఏ పుస్తకంలో

చూడాలో తేల్చుకోలేక, తెలీక జుట్టు పీక్కుంటుంటాడని వెనక్కి తిరిగి చూడకపోయినా నాకు తెలుసు.

సరే. 'యుకెజి స్టూడెంట్స్'కి టెల్గూ లెర్న్ చేయిద్దా మన్చెప్పి క్లాసుకెళ్లాను. ఎంత పసివారికైనా మనం ముద్దుగా నేర్పిస్తే వాళ్లు బుద్ధిగా నేర్చుకుని మనకే గురువులవుతారని జీవితానుభవం చెప్తోంది. దానికి ఏ టీచరు ట్రెయినింగూ అక్కర్లేదు. మనకసలది లేదనుకోండి. 'సరే ఇప్పుడు వీళ్లకి అ ఆలు ఏ మెథడ్‌లో నేర్పాలీ?' అని ఆలోచించాను. మా నాన్న తరం వాళ్లు నేర్చుకున్నట్టు ఇసకలో వేళ్లతో దిద్దించనా అని ఆలోచించా. నవనవలాడ్తున్న నునులేత మెట్టొంకాయ పిందెల్లాంటి వాళ్ల ముఖాలు చూస్తుంటే 'ఛ. తప్పుకదా. మరీనూ' అని నన్ను నేనే కేకలేసుకున్నా.

అసలు దిద్దడం ఏమిటీ? చూసింది చూసినట్టు కాపీ చెయ్యగలిగే మేధావుల తరం ఇది. అందుకే "నేను బోర్డు మీద రాస్తా. నేను చెయ్యి ఎలా తిప్పుతున్నానో జాగ్రత్తగా చూసి నేను రాసినట్టే మీరూ రాయాలి. చూడండి" అని 'అఆ ఇఈ' పెద్ద పెద్ద అక్షరాలు నెమ్మదిగా చెయ్యి కదుపుతూ రాసి చూపించా, "మళ్లీ చూడండి" అవే అక్షరాల మీదా నా హస్తవిన్యాసం మరో రెండుసార్లు ప్రదర్శించా. "ఇప్పుడు మీరు రాయండి."

బుర్రలు పలక మీదకి వంచేసి బొద్దు బొద్దు వేళ్లతో బలపాలు పట్టి కాన్‌సన్‌ట్రేషన్ కోసం నాలుకని పెదాలమధ్య నించి కొంచెం బయటకి పెట్టి రాస్తున్నారు. ముద్దులొలికే ఆ ముఖారవిందాలు కళ్లప్పగించి ఒళ్లు మరచిన తన్మయత్వంతో చూస్తూ కూచున్నా, రోజంతా వాళ్లతో గడిపే వాళ్ల క్లాస్ టీచర్ మిసెస్ కులకర్ణికి తెలుగు రాయడమే కాదు మాట్లాడడం కూడా రాదు. అందుకని వీళ్లందరనీ ఎల్లవేళలా ఇంగ్లీషు మాట్లాడమని కండిషన్ పెట్టింది. ఇప్పుడు రాస్తూ రాస్తూ ఈ పిల్లలు "నోనోరా. నాట్ దట్ రా. దిస్ లైక్ రా" అని ఒకళ్ల నొకళ్లు హెచ్చరించుకుంటూ రాసుకుంటున్నారు.


ఇద్దరు బుజ్జిగాళ్లు 'అందరికన్నా ఫస్ట్' రాసేసి నాకు చూపించడానికి పలకలు పట్టుకుని నిక్కర్లు పైకి లాక్కుంటూ, నాలుకలు లోపలికి లాక్కోవడం మర్చిపోయి, బుడి బుడి నడకలతో నా దగ్గర కొచ్చారు.

ఇమామ్ పలకమీద 'అ ఇ ఈ' అని రాసున్నాయి. రమేష్ పలకమీద పూర్తిగా చక్కగా 'అ ఆ ఇ ఈ' అని రాసేసాడు. ఇమామ్‌తో నేనేదో అనబోయేంతలో రమేష్ ఇమామ్ పలకలోకి తొంగి చూసి, "టీచర్! టీచర్! దిస్ బోయ్ నో కమ్ ది సెకండ్ ఆ" అన్నాడు.

వాడి అనువాద శక్తికి ఆశ్చర్యపోయా. "ఓరి! ఓరి బుడతడూ! నీకెంత భాషా జ్ఞానంరా!" అనుకున్నా. సంతోషించా.

కానీ మా ప్రిన్సిపాల్ గారిక్కూడా 'ఆ జ్ఞానం'. ఈ లెవల్లోనే ఉన్నందుకు మాత్రం విచారించా.

■



## మోసగించాడు!

**కొ**త్త నటి పాయల్ రోహత్‌గీని బాలీవుడ్ నిర్మాత సమీర్ కార్నిక్, తన చిత్రం 'క్యూం, హోగయా నా?'కు తీసుకున్నాడు. ఓ పాటలో వివేక్ ఒబెరాయ్‌తో కలిసి చేస్తే, యాభై వేల రూపాయలిస్తా నన్నాడు. సరేనని పాయల్ ఒప్పుకుంది. "రెండు రోజులైనా ఓ పైసా కూడా ఇవ్వకపోగా, షూటింగులకు కూడా పిలవలేదు. సంగతేంటో తెలుసుకుందామని ఫోన్ చేస్తే, ఆఖరి నిముషంలో తన దృక్కోణం మారిందనీ, ఆ సీన్‌లో ప్రారంభంలో ఇలా కనిపిస్తే చాలుననీ, తక్కినదంతా ఐశ్వర్యారాయ్ చేస్తుందనీ చెప్పాడు. నాకొళ్లు మండిపోయింది. 'ఏ క్యా హో రహా హై?'లో హీరోయిన్‌ను నేను. కొత్తదాన్నేం కాను, ఓ చిత్రం పాతదాన్ని. మరి నన్నలా ఆటలాడిస్తే ఎలాగుంటుంది? సరాసరి వెళ్లి, 'డాన్సులో నేనున్నానంటే, అది నా కెరీర్‌కు ప్లస్ పాయింట్ అవుతుందని కదా, అంగీకరించాను! రెండు రోజుల నుంచీ లేని దృక్కోణం ఇవాళెలా మారింది హఠాత్తుగా?' అని అడిగేశాను. కానీ లాభం లేకపోయింది. నాకు రావలసిన డబ్బు సంగతంటారా, ఈ నిర్మాతకే దానమిచ్చేశా ననుకుంటాను! ఇదంతా డర్టీ పాలిటిక్స్ లెండి!" అంటూంది విరక్తిగా పాయల్.